# రాములోరి పెళ్లి సందడి


హుజూరాబాద్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవానికి తరలివచ్చిన భక్తులు


గన్నేరువరం: గునుకులకొండాపూర్‌లో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్‌: చొప్పదండి,హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో వివిధ ఆలయాల్లో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. పల్లెలు, పట్టణాల్లో రాములోరి పెళ్లిసందడి నెలకొంది. కన్నుల పండువగా నిర్వహించిన సీతారాముల కల్యాణాన్ని ప్రజలు వీక్షించి తరించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు. కల్యాణోత్సవానికి ఆలయాల కమిటీ సభ్యులు అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కల్యాణోత్సవంలో ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. స్వామివారి పలువురు పట్టువస్త్రాలు సమర్పించారు. ముత్యాల తలంబ్రాలతో కల్యాణం నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవ విశేషాలను వేదపండితులు భక్తులకు వివరించారు. రాములోరి కల్యాణ క్రతువును వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా వివిధ ఆలయాలను మామిడి తోరణాలు, పూలదండలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించారు. కల్యాణ తంతు ముగిసే వరకు రామనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. అక్కడ హనుమాన్ విగ్రహాలను ఆవిష్కరించారు.వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు వినియోగించుకున్నారు. ఇల్లందకుంట రామాలయంలోని స్వామివారిని బీజేపీపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, కార్యదర్శి జయశ్రీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేషవాహనసేవలో పాల్గొన్నారు.


జమ్మికుంటలో కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు


మానకొండూర్: లలితాపూర్‌లో కిక్కిరిసిన భక్తులు


ఇల్లందకుంట: శేషవాహన సేవలో బండి సంజయ్‌కుమార్, నాయకులు


రామడుగు: వెదిరలో కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


గన్నేరువరంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు తీర్థప్రసాదాల అందజేత


జమ్మికుంట: రామాలయంలో సీతారాముల కల్యాణం


మానకొండూర్‌లో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్


చొప్పదండి: మంగళసూత్రం చూపుతున్న పూజారి


హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్‌లో...


తిమ్మాపూర్: అన్నదానంలో నుస్తులాపూర్ మాజీ సర్పంచ్


సైదాపూర్: బొమ్మకల్‌లో..

## క్లుప్తంగా

### మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యం బాటిళ్లు

గన్నేరువరం: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని మండలంలోని మైలారం గ్రామ ఎక్స్‌రోడ్డులో బుధవారం పట్టుకున్నామని ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామానికి చెందిన వ్యక్తి రూ. 21,712 విలువ గల మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

### అనుమతి లేకుండా ఇసుక తరలించొద్దు


పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్లు

సైదాపూర్: మండలంలోని ఎలబోతారంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపారు. వీణవంక మండలం జంగపల్లి వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారని ట్రాక్టర్ల యజమానులతో పాటు డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

### స్వామివారి నామాలతో భక్తులకు సేవ


భక్తులకు నామాలు పెడుతున్న శ్రీనివాస్

జమ్మికుంట: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులకు స్వామివారి నామాలు పెడుతూ భక్తిని చాటుకోవడం అందరిని ఆకట్టుకుంది. వీణవంక మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వీణవంక శ్రీనివాస్ మండలంలోని దేవాలయాలు, తిరుపతి, భద్రాద్రిలో జరిగే వేడుకలకు హాజరవుతాడు. మాల ధరించి, స్వామివారికి సేవ చేయడం సంతృప్తిని ఇస్తుందని అన్నాడు.

# నెమ్మదిగా ధాన్యం కొనుగోళ్లు

- దళారులను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు


లంబాడిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి లావణ్య (ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. 15 రోజుల క్రితం ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కానీ కొనుగోళ్లు మాత్రం నాలుగైదు రోజుల క్రితం నుంచే ప్రారంభమయ్యాయి. గన్నీ సంచులు రాక, మిల్లుల అలాట్‌మెంట్‌కాక కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి. దీంతో దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో యథేచ్ఛగా కొనుగోళ్లు చేస్తున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. మండలంలో మూడు ఐకేపీ, ఐదు డీసీఎంఎస్, 12 సింగిల్ విండోల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి.

**పొలాల వద్దకే దళారులు**

మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో రైతులు పంట పొలాల వద్ద ధాన్యం ఆరబోశారు. దీంతో దళారులు పొలాల వద్దకే వెళ్తున్నారు. అప్పుడే కోసిన ధాన్యానికి క్వింటాల్‌కు రూ.1,800, ఎండిన ధాన్యానికి క్వింటాలుకు రూ.2,100 కొనుగోలు చేస్తున్నారు. హమాలీ చార్జీలు లేకపోవడంతో రైతులు దళారులవైపు మొగ్గు చూపుతున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు కొనుగోలు కేంద్రాల్లో రెండువేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. సింగిల్‌విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల్లో మంగళవారం వరకు మూడు వేల క్వింటాళ్ల ధాన్యం తూకం వేశారు. అలాగే డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో రెండువేల ఐదువందల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. కొనుగోళ్లను వేగవంతం చేయడంతో పాటు సెంటర్లను మండల, జిల్లా ఉన్నతాధికారులు సందర్శించాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన విషయంపై మండలస్థాయి ఉన్నతాధికారులు తహసీల్దార్, ఏఓలను ఫోన్‌లో సంప్రదించగా గురువారం నుంచి సెంటర్లను సందర్శించి నిర్వాహకులను అలర్ట్ చేస్తామని తెలిపారు.

# మంత్రి 'పొన్నం'కు ఘన స్వాగతం


గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

జమ్మికుంట: అపరభద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంటలోని శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌లకు జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన


వాల్‌పోస్టర్లు అందిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

హుజూరాబాద్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా హుజూరాబాద్ ఫైర్ స్టేషన్ సిబ్బంది స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపే కరపత్రాలు, వాల్‌పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ రాజయ్య, సిబ్బంది వెంకటేశ్వర్లు, సురేందర్, ఐఆర్‌వీ రెడ్డి, ప్రభాకర్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుల ప్రచారం


నవాబుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న రాంగోపాల్‌రెడ్డి, నాయకులు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేటలో బీజేపీ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోమటి రెడ్డి రాంగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను రెండోసారి గెలిపించాలని అభ్యర్థించారు. ఇందుర్తి నుంచి నవాబుపేట, కొండాపూర్ మీదుగా హుస్నాబాద్‌కు రూ.ఇరవై కోట్లతో బీటీరోడ్డు మంజూరు చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్, కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు గూల్ల కిష్టయ్య, నాయకులు సాయి, రాజు, సంతోష్, వెంకటస్వామి, సంపత్ రెడ్డి, రాము, నవీన్ పలువురు పాల్గొన్నారు.

# దేశంలో అప్రజాస్వామ్య పాలన

- నార్త్ కొరియా నియంతలా మోదీ..
- మానకొండూర్ ఎమ్మెల్యే 'కవ్వంపల్లి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ పక్కన కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావు

తిమ్మాపూర్: దేశంలో అప్రజాస్వామిక పాలన సాగుతోందని, మోదీ నార్త్‌కొరియా నియంత కిమ్ తరహాలో పాలన సాగిస్తున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నేత వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి మాట్లాడారు. ప్రధానమంత్రికి ఆదానీ, అంబానీలు మాత్రమే మిత్రులన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఎంపీ లాండ్స్ ఉపయోగించని అసమర్థుడని విమర్శించారు. దేవుళ్ల పేరుతో రాజకీయం చేయవద్దని, ప్రాజెక్టుల విద్యాలయాలు నిర్మిస్తే అవే దేవాలయాలని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 200 సీట్లు కూడా రావని జోష్యం చెప్పారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసి రాజ్యాంగాన్ని మారుస్తారని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ పాపాల గుట్ట బద్దలైందన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో పాలన సాగించారని, కాంగ్రెస్ పాలనలో అవన్నీ బయటికి తీస్తామన్నారు.

**కాంగ్రెస్‌లోకి 'తుమ్మనపల్లి'**

బీఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకుడు కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్‌రావు మిత్రుడు అయిన తుమ్మనపల్లి శ్రీనివాసరావు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అల్గునూర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించే సమావేశంలో మంత్రి ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతారని తెలిపారు. శ్రీనివాస రావుతోపాటు సుమారు 250 మంది ఇతర పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరుతారని కవ్వంపల్లి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రణవ్, శ్రీనివాస్ తదితరులు హాజరవుతారని వెల్లడించారు.

## కనపర్తి–వీణవంక మధ్య హైలెవల్ వంతెన నిర్మించాలి

వీణవంక: మండలంలోని కనపర్తి–వీణవంక గ్రామాల మధ్య అండర్ బ్రిడ్జి వర్షాకాలంలో కొట్టుకుపోగా ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదని కనపర్తి, బేతిగల్ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బేతిగల్ చెరువు నుంచి భారీ వరద దిగువనకు చేరడంతో బ్రిడ్జి కొట్టుకుపోయిందని, దీంతో ప్రయాణం చేయడానికి నరకయాతన పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. అండర్ బ్రిడ్జి స్థలంలో హైలెవల్ వంతెన నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## పైపులైన్ లీకేజీ.. పట్టించుకునేవారేరి?



చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి–బొమ్మనపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారి పక్కన మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో నీరు కలుషితం అవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ అవుతున్న నీరు వ్యవసాయపొలంలోకి వెళ్తోందని, రెండు నెలలు అవుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వెలువడుతున్నాయి. తక్షణం పైపులైన్‌కు మరమ్మతు చేయాలని పలువురు కోరుతున్నారు.

## డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి



మానకొండూర్‌రూరల్: మండల కేంద్రం నుంచి జమ్మికుంట వరకు రహదారి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలను అస్తవ్యస్తంగా నిర్మించాడు. పనులు పూర్తి స్థాయిలో చేయకపోవడంతో మురుగునీరు మానకొండూర్ తూర్పు దర్వాజ చౌరస్తాలో నిలుస్తోంది. మురుగువాసనతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పనులు పూర్తిస్థాయిలో చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.